


RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

శనివారం, జూన్ 28 2025 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 257

# చైనాతో ఫలించిన చర్చలు

## ఆరేళ్ల తర్వాత కైలాష్ మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం

చైనాలోని కింగ్‌డావోలో భారత్-చైనా రక్షణ మంత్రుల మధ్య అనేక కీలక అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. షాంఘై సహకార సంస్థ (%ాజూా%) రక్షణ మంత్రుల సమావేశం సందర్భంగా శుక్రవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చైనా కౌంటర్ అడ్మిరల్ డాంగ్ జున్‌తో భేటీ అయ్యారు. భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురు నాయకులు క్రియాశీలక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కొవిడ్ సమయం నుంచి ఆగిపోయిన మానస సరోవర్ యాత్ర గురించి భారత రక్షణ మంత్రి ప్రస్తావించారు. అనంతరం యాత్ర పునఃప్రారంభంపై చైనా సానుకూలంగా స్పందించింది. దీంతో చర్చ అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్



సింగ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ప్రజలతో పంచుకున్నారు. కింగ్‌డావోలో జరిగిన రక్షణ మంత్రుల సమావేశం సందర్భంగా చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్‌తో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం అనుసరిస్తున్న సానూకూల విధానాలనే కొనసాగించాలని, కలిసి పనిచేస్తూ కొత్త సమస్యలు రాకుండా నివారించాలని ఇరుదేశాల తీర్మానించాయి. ఈ క్రమంలోనే ఆగిపోయిన కైలష్ మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభంపై భారత్ చేసిన చర్చలు సఫలమయ్యాయి. దీని పట్ల కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆనందం వ్యక్తం చేశారు.

# మార్పు అంటే ఇదేనా

## అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేరు మార్పుపై బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్, : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ' ఎక్స్' వేదికగా ఫైర్ అయ్యారు. తెలంగాణలో మార్పు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ 18 నెలల్లో కేవలం పేర్లను మాత్రమే మార్చిందని ఎద్దేవా చేశారు. విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, అవార్డుల పేర్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, ఫ్లై ఓవర్ల పేర్లు, గృహ నిర్మాణ పథకం, వ్యవసాయ రుణ ప్రోత్సాహకాలు, హరితహారం, అధికారిక నివాసం, తెలంగాణ తల్లి విగ్రహాలను మార్చారని మండిపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్



నేతలు సిగ్గు లేకుండా దేవతామూర్తి అయిన అన్నపూర్ణ పేరును తొలగించి ఇందిరా క్యాంటీన్ అని పేరు మార్చడం హిందూ విశ్వాసాలను అవమానించడమే అని బండి సంజయ్ పేర్కొన్నారు

# మావోయిస్టుల లేఖపై స్పందించిన మంత్రి సీతక్క

ములుగు, జూన్ 27: ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీ శాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే



ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు .ఆదివాసీల వ్యవహా ంపై ఇవాళ(శుక్రవారం) ఉదయం మంత్రి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఈ జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమర ుగవుతుు ్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టెందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు.

# ప్రపంచ పోలీసు క్రీడా

## పోటీలకు భారత్ ఆతిథ్యం

ఢిల్లీ: ప్రపంచ పోలీసు క్రీడల ఆతిథ్య దేశంగా భారత్ ఎంపికైంది. ప్రతిష్టాత్మకమైన 2029 ప్రపంచ పోలీస్, అగ్నిమాపక క్రీడలకు అహ్మదాబాద్ వేదిక అయింది. ఆతిథ్య దేశంగా భారత్ ఎంపికవడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వివరాలు వెల్లడించారు. ప్రతి భారత పౌరుడికి ఇది గొప్ప గర్వకారణమని అమిత్ షా పేర్కొన్నారు. పోలీసు క్రీడల నిర్వహణకు భారత్ ప్రతిష్టాత్మక బిడ్‌ను గెలుచుకుందని అమిత్ షా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన విస్తారమైన క్రీడా మౌలిక సదుపాయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అన్నారు. 1985



నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 20 సార్లు ప్రపంచ క్రీడలు జరిగాయి. ఎనిమిదిసార్లు అమెరికా, ఐదుసార్లు కెనడా, నాలుగుసార్లు యూరప్, రెండుసార్లు బ్రిటన్, ఒకసారి చైనా నిర్వహించింది. 2007లో అడిలైట్‌లో జరిగిన క్రీడల్లో తొలిసారి ఇండియన్ పోలీస్ కంటింజెంట్ పాల్గొంది. 2023 కెనడాలో జరిగిన 20 పోలీసు క్రీడల్లో 343 పథకాలను 133 మంది పోలీసు సిబ్బంది గెలుచుకున్నారు. వీటిలో 224 బంగారు, 82 వెండి, 37 కాంస్య పథకాలు ఉన్నాయి. 2007 నుంచి 2023 వరకు 1400 పథకాలను భారత పోలీసు సిబ్బంది గెలుచుకున్నారు.

### విద్యా ప్రమాణాలు-మెరుగైన

# వసతులే ప్రామాణికం

హైదరాబాద్ : రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయంపై హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్‌లు, భవనాలు.. ఇతర వసతులు ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలనే భావనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కృత్రిమ మేధ (ఏఐ) వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో తెలంగాణలోని ఇంజి




నీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీ పడేలా ఉండాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్లు కళాశాలలు

# అసలు వ్యక్తులను గుర్తించి

## శిక్షించాల్సిందే: కాంగ్రెస్

హైదరాబాద్, జూన్ 27:

ఫోన్ ట్యాపింగ్ కేసులో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు దేవరాజు గౌడ్ సిట్‌కు వాం గ్మూలం ఇచ్చారు. 2023 ఎన్నికల సమయంలో దేవరాజు గౌడ్ ఫోన్ ట్యాప్ అయ్యింది. దీంతో సిట్ అధికారుల నుంచి సమాచారం అందడంతో వాంగ్మూలం ఇచ్చేందుకు ఈరోజు (శుక్రవారం) జూబ్లీహిల్స్ సిట్ కార్యాలయనికి దేవ రాజు వచ్చారు. కాంగ్రెస్ నేత నుంచి సిట్ అధికారులు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. సిట్‌కు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం దేవ రాజు మీడియాతో మాట్లాడారు. సిట్ పిలుపు మేరకు వాంగ్మూలం ఇవ్వడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. 2023 ఎలక్షన్ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి



జిల్లా నుంచి పోటీ చేశారని. అదే సమ యంలో తాను కూడా ఆ జిల్లా గెలుపు బాధ్య తలు తీసుకున్నట్లు తెలిపారు. తమ ప్రణాళికలు తెలుసుకునేందుకే ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని చెప్పారు.

### పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల

హైదరాబాద్ : రాష్ట్రంలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. 73.35 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు పేర్కొన్నారు. బాలికలు 77.08 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, బాలురు 71.05 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జనగామ జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. సంగారెడ్డి 55.90 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. 42,834 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, 38,741 మంది హాజరయ్యారు.




ఇందులో 28,415 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలకు సంబంధించి రీకౌంటింగ్ చేయిం చాలకునే వారు ప్రతి సబ్జెక్ట్‌కు రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. రీవెరిఫికేషన్ అయితే ప్రతి పేపర్‌కు రూ. 1000 చొప్పున చెల్లించాలి. జులై 7వ తేదీ

# అత్యంత ప్రమాదకరంలో

## ఓమంజీరా బ్యారేజీ : కేటీఆర్

హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కారు చేతకానితనంతో నిన్న జూరాల ప్రాజెక్టును డేంజర్‌లోకి నెట్టిన సంఘటనకు 24 గంటలు గడవకముందే హైదరాబాద్ జంటనగరాలకు మంచినీరు అందించే మంజీరా బ్యారేజీని కూడా ప్రమాదంలో పడేయడం అత్యంత ఆందోళనకరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణలో సీఎం రేవంత్ ఘోర వైఫల్యం వల్లే వరుసగా నిన్న జూరాల ప్రాజెక్టుకు, నేడు మంజీరా బ్యారేజీకి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) నిపుణుల బృందం గత మార్చి 22న బ్యారేజీని సందర్శించి సమర్పించిన నివేదికను ప్రభుత్వం నిర్లక్ష్యంగా పక్కనపెట్టడం క్షమించరాని నేరం. మేడిగడ్డ బ్యారేజీ వద్ద కూడా చరిత్రలో లేనంత వరద రావడంతో రెండు పిల్లర్లకు పగుళ్లు వచ్చిన తరహాలోనే, ఇప్పుడు మంజీరాపై కూడా వరద ఒత్తిడి పెరిగి దిగువ భాగంలో పిల్లర్లకు పగుళు రావడం, ఆప్రాన్ కొట్టుకుపోవడం, స్పిల్ వేలోని భాగాలు కూడా దెబ్బతిన్నట్టు ఎస్డీఎస్ఏ నివేదిక గుర్తించినా ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడకపోవడం మరో దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు. నిన్నటిదాకా ఎన్డీఎస్ఎ నివేదిక చెప్పినా మేడిగడ్డ బ్యారేజీని రిపేర్ చేయక పోవడం, నేడు ఎస్డీఎస్ఓ నివేదిక అందినప్పటికీ మంజీరా బ్యారేజీ మరమ్మత్తులు చేపట్టక పోవడం.. ఈ కాంగ్రెస్ సర్కారు అలసత్వానికే కాదు.. దుర్మార్గపు వైఖరికి ప్రత్యక్ష నిదర్శనం





అని నిప్పులు చెరిగారు కేటీఆర్. రానున్న రోజుల్లో పైనుంచి మంజీరాలో వరద ఉధృతి పెరిగితే మరింత కోతకు గురై చివరికి డ్యామ్‌ను కూడా ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు అంచనా వేస్తున్న క్రమంలో ఇకనైనా ఈ చిల్లర రాజకీయాలు మాని అటు మేడిగడ్డ బ్యారేజీని, ఇటు మంజీరా బ్యారేజీని వెంటనే రిపేర్ చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై, కాంగ్రెస్ సర్కారుపై ఉందని కేటీఆర్ అన్నారు. బ్యారేజీల సామర్థ్యానికి మించిన వరద వచ్చిన సందర్భాల్లో ఆ ఒత్తిడిని తట్టుకోలేకే పిల్లర్లకు పగుళ్లు వచ్చినట్టు ఎస్డీఎస్ఓ గుర్తించింది. సరిగ్గా మేడిగడ్డ వద్ద కూడా ఊహించని వరద పోటెత్తడం వల్ల అక్కడ కూడా ఇదే తరహాలో పగుళ్లు ఏర్పడ్డాయి. కానీ దీన్ని అసెంబ్లీ ఎన్నికల వేళ భూతద్దంలో చూపించి అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ కుమ్మక్కై బీఆర్ఎస్‌పై బురదజల్లాయి. మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పియర్స్‌కు వచ్చిన పగుళ్లపై నానాయాగీ చేసిన కాంగ్రెస్-బీజేపీ నేతలు మంజీరా బ్యారేజీ పిల్లర్లకు వచ్చిన పగుళ్లపై కనీసం స్పందించకపోవడం వారి దిగజారుడు

### నా పాలనలో క్రిమినల్స్‌కు స్థానం ఉండదు :

# సీఎం చంద్రబాబు

గుంటూరు : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరులోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆంధ్ర పోలీస్ హ్యాకథాన్" కు శుక్రవారం శ్రీకారం చుట్టారు. జూన్ 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు జరగనున్న ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్, పోలీసు శాఖలో కృత్రిమ మేధస్సును (%ూ×%) ప్రవేశపెట్టి పనితీరును ఆధునీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తో పాటు హెూంమంత్రి వంగలపూడి అనిత, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర డీజీపీ హరిష్ కుమార్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం చంద్రబాబు, "కృత్రిమ మేధ భవిష్యత్తు కోసం కాదు ు ఇదే ప్రస్తుత అవసరం. పాలనను సమర్థవంతంగా చేయడానికి, పోలీసింగ్‌ను ఆధునీకరించేందుకు ఇది కీలక సాధనం" అని తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల మధ్య సాంకేతిక సహకారాన్ని పెంచడంలో ఏఐ ప్రధాన అడుగుగా అభివర్ణించారు. గత పాలనలో రౌడీయిజం, నక్సలిజం, స్మగ్లింగ్ వంటి సమస్యలను సమర్థవంతంగా అణిచిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, తన పాలనలో రాష్ట్రంలో క్రిమినల్స్‌కు స్థానం ఉండదు అని అన్నారు.



ప్రస్తుతం పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో నేరాల విచారణ, నిఘా, సమయానుకూల సమాచారం విశ్లేషణ, క్రిమినల్ ప్రొఫైలింగ్ తదితరాల్లో కృత్రిమ మేధ వినియోగం అవసరమైందన్నారు. "నేడు నేరం చేసే వ్యక్తుల ఆచరణ తీరు మారిపోతున్నది. వారిని కచ్చితంగా గుర్తించడానికి, నిర్దిష్ట పరిష్కారాలు అందించడానికి డేటా ఆధారిత విధానాలే మార్గం. ఈ దిశగా ఏఐ, డేటా ఆధారిత పాలనలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలి" అని చెప్పారు. ఈ హ్యాకథాన్‌ను 4 అనే ప్రైవేట్ టెక్నాలజీ సంస్థతో కలసి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. దేశం నలుమూలల నుంచే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ 60కి పైగా బృందాలు ఇందులో పాల్గొంటున్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థులు, స్టార్టప్‌లు, ఐటీ కంపెనీలు కలిసి పోలీసులు ఎదుర్కొంటున్న ఎనిమిది ప్రధాన సమస్యలకు ఆధారిత పరిష్కారాలను రూపొందించనున్నారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల

## ప్రశ్నార్థకంగా సాగునీటి ప్రాజెక్టుల భవితవ్యం : హరీశ్‌రావు

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల నిర్మాణ పనులు ముందుకు పోక, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన రాక తెలంగాణ సాగు నీటి రంగం సంక్షోభంలోకి వెళ్తున్నది అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, సాగును బాగు చేసిన ఘనత కేసీఆర్‌ది అయితే, ప్రాజెక్టులను పడావు పెట్టి, నిర్వహణ గాలికి వదిలి ఏపీకి నీళ్లు వదులుతున్న ఘనత రేవంత్ రెడ్డిది అని ధ్వజమెత్తారు. ఏడాదిన్నర పాలనలో జరిగిన ప్రాజెక్టుల ప్రమాదాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనాలు ..ఖమ్మం: పెద్దవాగు కొట్టుకుపోయింది నల్లగొండ: సుంకి శాల కుప్ప కూలింది. పాలవ మూరు: వట్టెం పంప్ హౌజ్ జలమయ మైంది .నల్గొండ: ఎస్ఎల్‌బీసీ కుప్ప కూలింది. జోగులాంబ గద్వాల్: జూరాల ప్రాజెక్టు గేట్ల రోప్స్ తెగిపోయా యి.సంగారెడ్డి: మంజీర డ్యాం ఆప్రాన్ వరద దాటికి కొట్టుకు పోగా, పియ్యర్స్‌ల్లో పగులు వచ్చాయి.పాలన వైఫల్యం, కాంగ్రెస్ చేతగాని తనం వల్లే ఇన్ని ప్రమాదాలు జరిగాయి. ఇవేవి ఎన్డీఎస్ఏకు కనిపించవు, వినిపించవు.మేడిగడ్డ కుంగిన వెంటనే ఎన్డీఎస్ఏకు లేఖ రాసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న ప్రాజెక్టుల ప్రమాదాలు ఎందుకు కనిపించడం లేదు? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేడిగడ్డలో 85 పియ్యర్స్ ఉంటే అందులో ఒక పియ్యర్ కుంగిపోతే మొత్తం ప్రాజెక్టే కుప్ప కూలిందని ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి, ఏడాదిన్నరలో జరిగిన ఘటనలకు ఎవరు



బాధ్యులు? కాళేశ్వరంపై ఏడుస్తూ కాలం వెల్లదీయడం తప్ప, ఏడాదిన్నరగా మీరు చేసిందేం ఉంది రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. ఒక చెరువు తవ్వింది లేదు, ఒక్క చెక్ డ్యాం కట్టింది లేదు, ఒక్క ఎకరాలకు కొత్తగా నీరు ఇచ్చింది లేదు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే కొత్తగా ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తామని చెప్పి, ఆరు వేల ఎకరాలకు కూడా ఇవ్వలేదు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో సాధించిన తెలంగాణలో మళ్లా నీళ్ల కోసం, నిధుల కోసం, నియామకాల కోసం కొట్లాడాల్సిన పరిస్థితి తెచ్చావు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నీళ్లు: బనకచర్ల ద్వారా ఏపీ తరలించే కుట్రనిధులు: ఏపీకి తరలివెళ్తున్న కేంద్ర నిధులునియామకాలు: నోటిఫికేషన్ల కోసం విద్యార్థులు రోడ్లెక్కే పరిస్థితి. రేవంత్ రెడ్డి! ఇప్పటికైనా కళ్లు తెరువు. తెలంగాణకు ప్రాణ ధారం అయిన సాగునీటి రంగాన్ని నీ రాజకీయ అజెండాలకు బలి చేయకు. మేడిగడ్డపై దుష్ప్రచారం ఆపేసి, ఇకనైనా ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టు. తెలంగాణ ప్రజలు నీ రోత మాటలతో పాటు, నీ చేతగాని తనాన్ని గమనిస్తున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మెదక్ టుడే
శనివారం, జూన్ 28 2025

# మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి




**- ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**- రిజ్వాన్ బాషా షేక్,పాలకుర్తి శాసనసభ్యులు మామిడాల యశస్విని రెడ్డి**

**జనగామ జూన్ 27 :**గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు శుక్రవారం పాలకుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శ్రీ శివ పార్వతి మహిళా సంఘంలోని ఇద్దరు సభ్యులు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను శాసనసభ్యులు యశస్విని రెడ్డితో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఇందిరా మహిళా శక్తి కాంటీన్ ద్వారా మహిళలకు ఆర్థిక ప్రగతి ఏర్పడుతోందన్నారు మహిళామణుల స్వయం ఉపాధికి ప్రభుత్వం అండగా నిలబడుతూ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇస్తోందని.. ఈ రుణాలతో మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు...ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ యూనిట్ లకు ఏర్పాటు కి సహకారం అందిస్తుందన్నారుకాంటీన్ లో తయారుచేసే భోజనం నాణ్యత తో పాటు రుచికరంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు శాసనసభ్యులు యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. మహిళల సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తుందన్నారమహిళలు ఆర్థికంగా ఎదిగి ఇతర మహిళలకు స్ఫూర్తిగా నిలవాలి అన్నారు.ఉత్సాహంగా ఉండే మహిళలకు సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందన్నారు అనంతరం కలెక్టర్, శాసనసభ్యులు కాంటీన్ లో టిఫిన్ చేసి.... రుచికరంగా ఉందని తరాల అనిత, తరాల అనిత (ఒకే కుటుంబానికి చెందిన తోడికోడళ్ళు )నిర్వాహకురాళ్ల ను అభినందించారు ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ వసంత ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# హాస్టల్ పైనుంచి దూకిన విద్యార్థిని మృతి

**- గుట్టుచప్పుడు కాకుండా శవాన్ని తరలించేందుకు ప్రయత్నం చేస్తున్న అధికారులు**



**మంచిర్యాల జిల్లా** మంచిర్యాలలో విషాద ఘటన..ఎస్సీ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ హాస్టల్ భవనం పై నుంచి దూకిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కలకలం రేపుతోంది. ఈ విషాద ఘటనపై అధికారుల ప్రవర్తన మరింత అనుమానాలకు తావిస్తోంది. ఘటనపై ఎటువంటి అధికారిక ప్రకటన లేకుండానే, శవాన్ని గుట్టుచప్పుడు కాకుండా కుటుంబానికి పంపే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం.స్థానికులు, విద్యార్థినుల సహచరులు, పలు సంఘాలు ఈ చర్యల పై నిరసన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యం పట్ల వ్యవస్థ నిర్లక్ష్యం చూపుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పౌరసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# జర్నలిస్టుల సేవలు మరువలేనివి

**- ఈద జనసేన జిల్లా అధ్యక్షుడు కూస సతీష్.**



**కాల్వ శ్రీరాంపూర్ జూన్ 27.** నిరంతరం ప్రజా సమస్యల కోసం శ్రమించే జర్నలిస్టుల సేవలు మరువలేనివని ఈద జనసేన జిల్లా అధ్యక్షుడు కూస సతీష్ అన్నారు. శుక్రవారం కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని ఊశన్న పల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద జర్నలిస్టు యూనియన్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన బాలే శివప్రసాద్ ను స్థానిక నాయకులతో కలిసి శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించి సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్ తో పాటు పలువురు మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తి సమాజంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండకడుతూ సామాన్యులకు సంక్షేమ పథకాలు అందేందుకు కృషి చేసే వృత్తి జర్నలిజం అని పేర్కొన్నారు. జర్నలిస్టు శివప్రసాద్ సూర్య దినపత్రికలో పనిచేస్తూ మండలంలోని సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తూ వార్త కథనాలు రాయడం సంతోషదాయకం అన్నారు. బాలే శివప్రసాద్ మా గ్రామానికి చెందినవారు కావడం మాకెంతో గర్వకారణమని, శివప్రసాద్ మరెన్నో ఉన్నత పదవులు పొంది ప్రజలకు సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు అనుముల రాజిరెడ్డి, ఆవుల తిరుపతి, అనుముల చంద్రయ్య, మాజీ మార్కెట్ డైరెక్టర్ ముస్కు కొండాల్, లక్కమారి కాపు సంఘం నాయకులు ఆవుల రామన్న, మంద తిరుపతి, ఆవుల సాయి, ముస్కు రామన్న, మేడిద వేణు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి లక్ష రూపాయల విలువగల లారీ ఇటుక లోడును అందజేసిన మాజీ జడ్పీటిసి వంగల తిరుపతిరెడ్డి




**కాల్వ శ్రీరాంపూర్ జూన్ 27.**
పాండవుల గుట్ట సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప దేవాలయానికి కాల్వ శ్రీరాంపూర్ మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి తనవంతుగా ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విలువ చేసే ఒక లారీ ఇటుక లోడును అందజేశారు. మాజీ జెడ్పిటిసి వంగాల తిరుపతిరెడ్డి పాండవుల గుట్ట సమీపంలో జరిగే ఆలయ నిర్మాణ పనులను ఆయన సందర్శించారు.ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విలువచేసే ఇటుక లారీ లోడ్ ను అందజేసిన వంగల తిరుపతిరెడ్డి కి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడెపు రాజు, ఓరుగంటి కొమురయ్య, పెద్దిరెడ్డి వీరారెడ్డి, ఓడ్నాల శ్రీనివాస్, ఉప్పుల కుమార్, తాత రవి, స్వామి తదితరులు ఉన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ -ను విజయవంతం చేయాలి : ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆడిషనల్ డిజిపి చారుసిన్హా



**- ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యాలయం, హైదరాబాద్ నుండి వివిధ జిల్లాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నా అదనపు ఎస్పీ చంద్రయ్య, వివిధ శాఖల అధికారులు.**



**రాజన్న సిరిసిల్ల జూన్ 27 :** సమన్వయంతో పనిచేసి ఆపరేషన్ ముస్కాన్ – క్నీ ను విజయవంతం చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆడిషనల్ డిజిపి చారుసిన్హా అన్నారు.శుక్రవారం ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యాలయం హైదరాబాద్ నుండి వివిధ జిల్లాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆడిషనల్ డిజిపి మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడ జులై 01 నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ ను అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని కోరారు.ఆపరేషన్ ముస్కాన్ లోపాలు పంచుకొంటున్న ప్రతి ఒక్క అధికారి సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా విధులు నిర్వహించాలని సూచించారు. బాలకార్మికులు కనిపిస్తే పోలీస్ వారికి,1098 నెంబర్ కి సమాచారం అందించేలా ప్రజల్లో అవగహన కల్పించడంతో పాటుగా బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారికి చట్ట ప్రకారం శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఒక్కొక్క డివిజన్ స్థాయిలో ఎస్.ఐ స్థాయి అధికారితో పాటుగా ఒక మహిళా పోలీస్ అధికారి, నలుగురు సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో కలసి టీమ్ లు ఏర్పాటు చేసి జిల్లాలో ఉన్న ఇటుక బట్టిలు, వివిధ రకాల పరిశ్రమలు, బస్ స్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద క్షుణ్ణంగా పరిశీలించి కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా ప్రణాళిక రూపొందించుకోవడం జరిగిందని వివరించారు.ఈవీడియో కాన్ఫరెన్స్ లో సి డబ్ల్యు సి చైర్మన్ అంజయ్య, ఇన్స్పెక్టర్ లు నటేష్, నాగేశ్వరరావు,జిల్లా షీ టీం అధికారులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు,

# టి.బి, క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం



**జూన్ 27 ( ముస్తాబాద్- ప్రతినిధి):**
గ్రామం నామాపూర్ పీహెచ్ సి పోతుగల్ మండలం ముస్తాబాద్ లో క్షయ వ్యాధి అవగాహన పై టి.బి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డా. గీతాంజలి ఆధ్వర్యంలో టి.బి ముక్త్ భారత్ అభియాన్ నామాపూర్ ఉప ఆరోగ్యకేంద్రలో నిర్వహించారు.టి.బి సూపర్వైజర్ (ఎస్ టీ ఎస్ )మహిపాల్, మాట్లాడుతూ ఇందులో షుగర్, క్యాన్సర్, బీపీ, దీర్ఘకాలిక వ్యాధులు, పొగాకు తీసుకునే వారిలో క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఎక్కువ గా ఉన్నాయని, క్షయ లక్షణాలు రెండు వారాలు మించి దగ్గు,జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం,వున్న వారు తేమడ పరీక్షలు చేయించుకోవాల్సిందిగా సూచించారు, టి.బి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం లో 162 మంది పైగా టిబి స్క్రీనింగ్ చేశామని 24 మంది అనుమానితుల నుండి తేమడ నమూనాలను సేకరించి ల్యాబ్ కి పంపించమన్నారు. 14 మంది సింటమేటిక్ వాళ్ళని ఎక్స్ రే కి సిరిసిల్ల మెడికల్ కాలేజ్ రేడియాలజీ ల్యాబ్ కి రెఫర్ చేసామని అందులో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి 6 నెలల పాటు పూర్తి ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామన్నారు.అలాగే నిక్ష్యయ్ పోషన్ ద్వారా వ్యాధిగ్రస్తుతులకు నెలకి 1000- రూ. పౌష్టికాహారం కోసం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లో డా. గీతాంజలి, టి.బి సూపర్వైజర్ మహిపాల్, టిబి నోడల్ సి ఎచ్.ప్రసాద్, హెచ్ ఐ వి.కౌన్సిలర్ సురేష్, ప్రకాష్, రజిత, రమ్య, ఏన్ ఎం లు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో అండర్ 16,19 క్రికెట్ ఎంపిక పోటీలు.

**బెల్లంపల్లి ఆర్సీ**
తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29 వ తేదీన బెల్లంపల్లి రైల్వే స్టేషన్ వద్దగల మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో మంచిర్యాల జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా ఇన్చార్జ్ పైడిమల్ల నర్సింగ్, జిల్లా కోఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, జిల్లా కోచ్ జాడి శేఖర్ తెలిపారు. ఈ పోటీలలో 16,19 సంవత్సరాల లోపు వారికి ఎంపిక ఉంటుందని వారు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే టోర్నమెంట్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తెల్లని దుస్తులు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని వారు కోరారు. వివరాలకు 6281 420180, 9440356329, 7981098099 మొబైల్ఫోన్లను సంప్రదించాలని వారు కోరారు.

# కదలని బొమ్మకు "కవిత"లు చెప్పినా దండగే.

**గుళ్ళపల్లి ఆనంద్ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్, సిర్పూర్ నియోజకవర్గం ఇంచార్జి**

**తీహార్ జైలులో చిప్ప కూడు తిన్నా ఇంకా తెలుసుకోలేదా..?**

**కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ టీడీపీ పాఠాలతో పైకొచ్చిన వారే**

**చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత కవితకు ఉందా..?**

**కవిత వ్యాఖ్యలపై "గుళ్ళపల్లి ఆనంద్" ఆగ్రహం**

**కుంభకోణాల కుటుంబానికి అంతకన్నా ఏం తెలుస్తుంది**



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా** భారత దేశంలో ఒక పరిపాలనా దక్షులడిగా పేరు గాంచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని విమర్శించే స్థాయి తెలంగాణ జాగృతి మహిళా నాయకురాలు కవితకు లేదని టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు విమర్శించారు. బనకచర్ల వ్యవహారంపై స్పందిస్తూ మాట్లాడిన కవిత వ్యాఖ్యలపై గుళ్ళపల్లి ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ దందాలో దేశ వ్యాప్తంగా తెలంగాణ పరువు తీసి తీహార్ జైలులో నెలల తరబడి చిప్పకూడు తిన్న కవిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై విమర్శలకు దిగడం అవివేకం అన్నారు. సముద్రంలోకి వృధాగా పోతున్న గోదావరి వరద నీటిని పట్టుకుని, రాయలసీమ, పల్నాడు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ తాజా ప్రభుత్వ నిర్ణయం ద్వారా పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు పరిపాలనా శక్తిని అందిస్తూ, రాష్ట్రం జలస్వావలంబన దిశగా ముందడుగు వేసేందుకు ఉపక్రమించిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య రాజకీయంగా జరుగుతున్న విమర్శ, ప్రతి విమర్శలు ప్రజలకు సముచితంగా తెలిసే ఆస్కారం ఉండాలన్నారు. బిఆర్ఎస్ చేస్తున్న విమర్శలు గాడి తప్పుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ బిర్యాని తినిపించి దీనిపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం లేదన్న కవిత విమర్శలు సరికావని స్పష్టం చేశారు. . "కదలని బొమ్మకు కవితలు చెప్పినా .. మారని మనిషికి నీతులు చెప్పినా ఒకటేనని" ఆ విషయం కవిత విషయంలో రూడీ అవుతుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడుని విమర్శించే ముందు కవిత ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. తెలంగాణ సమాజంలో లిక్కర్ చిచ్చు పెట్టిన కవిత సొంత కుటుంబాన్ని కూడా వదలకుండా చిచ్చుపెట్టి అటు పార్టీలో ఇటు సమాజంలో ప్రకంపనలు రేపుతూ రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారని ఘాటుగా స్పందించారు. మీ తండ్రి కెసిఆర్ పరిపాలన విధ్వంసం గురించి మాట్లాడవా..?మీ తండ్రి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి కవిత మాట్లాడితే బాగుంటుందని బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. కాలేశ్వరం అక్రమాలపై కెసిఆర్, మీ బావ హరీష్ రావుల తీరుపై నోరు విప్పితే బాగుంటుందని కోరారు. అదేవిధంగా కవిత సోదరులు కేటీఆర్ ఈ ఫార్ములా రేస్, డ్రగ్స్ దందా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కవిత స్పందిస్తే ప్రజలు హర్షిస్తారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని గత పదేళ్లు విధ్వంసం చేసి అన్ని విధాల రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టిన మీ తండ్రి కేసీఆర్ పాలన గురించి ఎన్నో కథలు చెప్పవచ్చని ప్రజలు ఇంకా చెప్పుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన పాఠాలు నేర్చుకుని మీ తండ్రి కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, ఇదే పార్టీ నుండి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అయ్యారని పార్టీ ఎందరికో రాజకీయ భిక్ష పెట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ సెంటిమెంట్ పేరిట అధికారంలోకి వచ్చి అనేక కుంభకోణాలు చేసిన కుటుంబానికి అంతకుమించి ఏం తెలుస్తుందని కవితను ఉద్దేశించి విమర్శించారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్. విడుదల



**పాపన్నపేట,జూన్,27, మెదక్ టుడే న్యూస్:**
గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి గాను శుక్రవారం రోజు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆఫీస్ కు తరలి వెళ్తున్న పంచాయతీ కార్మికులను పాపన్న పేట పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పాపన్నపేట పోలీసు స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ సమస్యల సాధన కోసం కమిషనర్ ఆఫీస్ కు తరలి వెళ్లగా పోలీసులు అడ్డుకొని కార్మికులందరికీ అరెస్టు చేయడం దారుణమన్నారు .గ్రామపంచాయతీ కార్మికులకు ఉరితాడుగా ఉన్న మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జీవో నెంబర్ 51ని సవరించాలని,పాత పద్ధతిలో ఉన్న కేటగిరి వారీగా విధులు నిర్వహించాలని జీవో నెంబర్ 60 ప్రకారం కేటగిరీలుగా వేతనాలు చెల్లించాలని కోరారూ. ఈ కార్యక్రమంలో సామెల్,నాగేష్ గౌడ్.బాబు,శేఖర్, పాండు, రాములు,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల హుండీ ఆదాయం 48.48 లక్షలు



**పాపన్నపేట,జూన్,27, మెదక్ టుడే న్యూస్:**
ఏడుపాయల హుండీ ఆదాయం 48 లక్షల 48 వేల 340 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ వెల్లడించారు. ఏడుపాయల్లోని గోకుల్ షెడ్ లో ఈ లెక్కింపు కొనసాగింది. 60 రోజులకు గాను ఉండే లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల సిబ్బంది సూర్య శ్రీనివాస్ శ్యామ్, ప్రతాప్ రెడ్డి నర్సింలు, బత్తిని రాజు, వరుణా చారి, యాదగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఉండి లెక్కింపు సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తమ పోలీసు సిబ్బంది తో తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.

# హుస్నాబాద్ లో మంత్రులకు అడుగడుగున జననీరాజనం

**- 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం,150 పడకల ఆసుపత్రి హుస్నాబాద్ కొత్తపల్లి నాలుగు వరుసల రహదారి కి శంకుస్థాపన**

**- హుస్నాబాద్ కు 50 సీట్ల మెడికల్ పీజీ సెంటర్ మంజూరు చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**- హుస్నాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్న మంత్రులు**



**(హుస్నాబాద్ ప్రతినిధి)** హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. హుస్నాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గ చిరకాల స్వప్నం అయిన 50 సీట్లు తో కూడిన మెడికల్ పీజీ సెంటర్ ను మంత్రి దామోదర రాజనర్సింహ మంజూరు చేశారు. హుస్నాబాద్ కి పీజీ మెడికల్ సెంటర్ మంజూరు పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. పీజీ మెడికల్ సెంటర్ వల్ల హుస్నాబాద్ హాస్పిటల్ హబ్ గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తారు. అంతకుముందు హుస్నాబాద్ నియోజకవర్గం బస్వాపూర్ గ్రామానికి చేరుకున్న మంత్రులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నేతలు ఘన స్వాగతం పలికారు. బస్వాపూర్ నుండి హుస్నాబాద్ వరకు 15 కిలోమీటర్ల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆద్యంతం జరిగిన ర్యాలీ మంత్రుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. హుస్నాబాద్ వీధుల గుండా సాగిన ర్యాలీ హాస్పిటల్ వరకు జరిగింది.హుస్నాబాద్ లో 82.00 కోట్ల రూపాయలతో 150 పడకల ప్రభుత్వం వైద్యశాల కు మంత్రులు శంకుస్థాపన చేశారు.అనంతరం 11.50 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన 50 పడకల మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు.హాస్పిటల్ లో నూతనంగా నిర్మించిన ఆపరేషన్ థియేటర్ , ఐసీయూ, ఎన్ బిఎస్ యూ, ఓపీ బ్లాక్, పోస్ట్ నెటల్ వార్డు, ఫార్మసీ , ల్యాబ్ ,ప్రసూతి విభాగాలకు ప్రారంభించారు.77.20 కోట్ల రూపాయలతో కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు ఉన్న రెండు వరుసల రహదారి ని నాలుగు వరుసల రహదారి గా అభివృద్ధి పరుచుటకు (ప్యాకేజీ -2) కు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ లు శంకుస్థాపన చేశారు.అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చిరకాలంగా ఎదురు చూస్తున్న హుస్నాబాద్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కేబినెట్ మంత్రుల సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి చేసుకుంటున్నామని శాతవాహన యూనివర్సిటీ లో ఇంజనీరింగ్ కాలేజి తరగతులు హుస్నాబాద్ లో ఈ సంవత్సరం నుండి ప్రారంభం అవుతున్న సందర్భంగా సంతోషాన్ని వ్యక్తం చేశారు.82.00 కోట్ల రూపాయలతో 150 పడకల ఆరోగ్య కేంద్రానికి,77.20 కోట్ల రూపాయలతో రాజీవ్ రహదారి కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు రెండు వరుసల రహదారుల నుండి నాలుగు వరుసల రహదారి కి ఫేజ్ 2 కు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. నూతనంగా 11.50 కోట్ల రూపాయలు తో నూతనంగా నిర్మించిన 50 పడకల మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించుకున్నామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.తనని గెలిపించిన హుస్నాబాద్ గౌరవాన్ని పెంచుతున్నాని హుస్నాబాద్ ను అభివృద్ధి లో అన్ని రంగాల్లో ముందుంచుతానన్నారు. హుస్నాబాద్ కి వచ్చిన మంత్రులు హుస్నాబాద్ అభివృద్ధికి అభయం ఇవ్వాలని కోరారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు అభివృద్ధి , ఇంజినీరింగ్ కాలేజీ ,టూరిజ్ ప్రాజెక్ట్ లు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనీ తెలిపారు.మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ హుస్నాబాద్ కు 50 సీట్ల మెడికల్ పీజీ సెంటర్ ను ప్రకటించారు.తెలంగాణ గొంతు తెలంగాణహక్కును పార్లమెంట్ లో యావత్ దేశానికి వినిపించిన వ్యక్తి పొన్నం ప్రభాకర్ అని కొనియాడారు.గత 16 నెలల్లో హుస్నాబాద్ అభివృద్ధి ను చూస్తే పొన్నం ప్రభాకర్ ఏ ఒక్క శాఖ ను వదలరు.. నా హుస్నాబాద్ అని అభివృద్ధి నీ ఇక్కడికి తీసుకొస్తారనీ తెలిపారు.నా ప్రజల ఆరోగ్యం నా బాధ్యత నా ప్రభుత్వం బాధ్యత అని ఇక్కడికి పొన్నం ప్రభాకర్ హాస్పిటల్ తెచ్చారన్నారు. సమాజంలో మార్పు రావాలంటే విద్యా, వైద్యం,నైపుణ్యం ఉండాలన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం లో 16 నర్సింగ్ కాలేజీలు మంజూరు చేశామని అంతర్జాతీయ స్థాయిలో మన ఆడ బిడ్డలు నర్స్ లు ,డాక్టర్ లు ఉండాలని కోరుకున్నారు.ఒకప్పుడు హుస్నాబాద్ నక్సల్ ప్రాంతం ,కమ్యూనిస్ట్ ప్రాంతం కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రాంతంగా మారిందని తెలిపారు.గత 50 సంవత్సరాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్ల సంఖ్య పెరగలేదు..కానీ ఇప్పుడు అదనంగా మాత శిశు హాస్పిటల్ లో కలిసి 250 పడకలు వచ్చాయనీ హుస్నాబాద్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూరాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం నుండి ఆర్థిక విధ్వంసం ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నామని తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నామని తెలంగాణ అభివృద్ధి సంక్షేమంలో ముందుకు తీసుకుపో తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం వ్యవసాయం కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిందని 40 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాలో వేసిందని పేర్కొన్నారు. నెల రోజుల్లో సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి చేత ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.ఆయిల్ ఫామ్ పంట వల్ల రైతులు ఆర్థికంగా స్థిరత్వం ఉంటుందని తెలిపారు.తెలంగాణ భూములు ఎడారి భూములు కాదని పంటలు పండే పుణ్యభూమి దక్కన్ పీఠభూమి గా అభివర్ణించారు.హార్టికల్చర్ పంటలు పండించాలని ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని పేర్కొన్నారు. హుస్నాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు.77 కోట్ల తో హుస్నాబాద్ నుండి సుందరగిరి వరకు ఫేజ్ 2 కింద రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. సుందరగిరి నుండి కొత్తపల్లి వరకు 80 కోట్లతో నాలుగు వరుసల రహదారి కి వారం రోజుల్లో మంజూరు అవుతుందని ,దానికి పది రోజుల్లో పనులు ప్రారంభం అయ్యేలా చూస్తామన్నారు.9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద పంట పెట్టుబడి సహాయం అందించామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల పనులు వేగంగా పూర్తి చేసి త్వరలోనే పంట పొలాలకు సాగు నీరు అందిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజలు కలలు కన్నా హుస్నాబాద్ అభివృద్ధికి మేము తమంత అండగా ఉంటామని హామీ ఇచ్చారు.సమావేశంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,జిల్లా కలెక్టర్ హైమావతి,అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్,సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ ,రామాయంపేట,మున్సిపాలిటీలు అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు

# కృషి చేస్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు



**మెదక్ జూన్ 27 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , మెదక్ రామయంపేట్ మున్సిపల్ కమిషనర్స్, మున్సిపల్ డీఈలు,తో కలిసి పట్టణ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే మైనంపల్లి సమీక్ష నిర్వహించారు. నేపథ్యంలో 32 వార్డులలో గల సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ శాఖలతో అధికారులతో కలిసి ఒకరికొకరు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా డ్రైనేజీ,రోడ్లపై ప్రత్యేక దృష్టి సాధించామని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. వార్డుల్లో ఇంకా ఏమైనా సమస్య లుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.అనంతరం కాంగ్రె స్ నాయ కులతో మున్సిపల్ తాజా,మాజీ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమీక్షించి వార్డుల వారీగాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హవేలి గన్పూర్ తాసిల్దార్. సింధూ రేణుక, మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి రామా యంపేట మున్సిపల్ కమిషనర్ ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల సమక్షంలో యువకులకు కౌన్సిలింగ్



**గోదావరిఖని,జూన్27,**

గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి విటల్ నగర్ లోని స్నేహితుని పుట్టినరోజు సంబరాల్లో పాల్గొని ప్రజా జీవనానికి భంగం కలిగే విధంగా ప్రవర్తించారని, వెంటనే యువ కుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. యువకుల తల్లిదండ్రులు భవిష్యత్తులో తమ పిల్లలకు ఎలాంటి చెడు ప్రవర్తన లు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. నేర నియంత్రణ సత్ ప్రవర్తన కై ముందస్తు చర్యలలో భాగంగా ఒక సంవత్సరం వరకు ఎలాంటి చెడు ప్రవర్తన పాల్పడకుండా రామగుండం తహసిల్దార్ ముందు బైండోవర్ చేశామని, వన్టౌన్ సిఐ ఓ ప్రకటనలు తెలిపారు. గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ తరఫున ప్రజలకు ,తల్లిదండ్రులకు సూచన తమ పిల్లల యొక్క ప్రవర్తనను ,కదలికలను ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు ఎవరితో స్నేహం చేస్తున్నారు. వారి స్నేహితుల ప్రవర్తనలు అలవాటు గురించి తెలుసుకోవాలన్నారు. ఎవరైనా పోలీస్ స్టేషన్ పరిధిలోప్రజాజీవవానికి, ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వెంటనే స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించాలని, పోలీస్ ఎల్లప్పుడు ప్రజా, భద్రత, రక్షణకు అందుబాటులో ఉంటుందని, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ రమేష్ ,సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన కోల్ మైన్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్



**గోదావరిఖని,జూన్27**

ఆర్ జీవన్ ఓసిపి ఫైవ్ కోల్ మైన్ ప్రాజెక్ట్ ఆఫీసర్గా డి. రమేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు స్వాగతం చెప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ గబాలే గని మేనేజర్, పొను గోటి శ్రీనివాస్ రక్షణ అధికారి, సీఎంఓ ఏఐ సెంట్రల్, పి. పెరుమల్ల శ్రీనివాస్ సీఎం ఓ ఏ ఐ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, రమేష్ ప్రాజెక్ట్ ఇంజనీర్, వైస్ ప్రెసిడెంట్, వీటి చంద్రమౌళి సీనియర్ సర్వే ఆఫీసర్, గంధం రాములు ఆఫ్ లోడింగ్ మహేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రామగుండం విధ్వంస పాలన కొనసాగుతుంది

**పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



**గోదావరిఖని జూన్ 27**

:రామగుండం నియోజకవర్గంలో ప్రజా పాలన అంటూ విధ్వంస పాలన కొనసాగిస్తున్నారని, సుందరీకరణ అభివృద్ధి పేరిట చిరు వ్యాపారులు దుకాణాలు తొలగిస్తు వారి జీవనోపాధి లేకుండా చేస్తూ పెదవారి జీవితాలను కాంగ్రెస్ పాలకులు రోడ్డున పడవేస్తున్నరని, రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిఖని చౌరస్తా సమీపంలో రోడ్డు వెడల్పు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో షాపులను కోల్పోయిన వారికి ప్రత్యాహ్నాయంగా కల్పించిన స్థలంలో ఆ షాపుల యజమానులు వేసుకున్న షెడ్లను సోమవారం మున్సిపల్ అధికారులు కూల్చివేయడంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,బి.ఆర్.ఎస్ నాయకులతో కలిసి మున్సిపల్ అధికారులు కూల్చిన షెడ్లను పరిశీలించారు. సంబంధిత బాధితులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని చిరు వ్యాపారులంతా తమ దుకాణాలు మున్సిపల్ అధికారులు ఎప్పుడు కుల్చుతారో అన్న భయంతో బతుకుతున్నారని అన్నారు. దుకాణాలు కుల్చడం... కూల్చిన వాటిని నిర్మించడం మళ్ళీ వాటిని కూల్చడం ఇదేనా ప్రభుత్వ పని అని ప్రశ్నించారు. చిరు వ్యాపారులను షెడ్లను కూల్చిన విషయంలో ఎవ్వరు బాధ్యత వహిస్తారు. వీరికి ఎవ్వరు న్యాయం చేస్తారని ధ్వజమెత్తారు.దుకాణాలు ఎవ్వరు ఇక్కడ నిర్మించుకోమని చెప్పారు అని బాధితులను తాము అడుగగా, తమకు షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి అయ్యేవరకు 6 నెలల పాటు ఇక్కడ షాపులు వేసుకోమని మహంకాళి స్వామి, ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ చెప్పారని వారు అన్నారు. ఇక్కడ దుకాణాలు నిర్మాణం చేసుకోండి అని చెప్పడంతోనే దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు చేసి షెడ్లను వేసుకున్నారని, దాదాపు నెల రోజులుగా ఇక్కడ నిర్మాణ పనులు జరుగుతుంటే మాట్లాడని మున్సిపల్ అధికారులు దుకాణాలు పుర్తి అయ్యాకా అర్థంతరంగా వచ్చి షెడ్లను కూల్చడం ఎంటనీ ఆయన ప్రశ్నించారు. 12 మందికి జరిగిన నష్టానికి బాధ్యులేవ్వరని వారికి నష్టపరిహారం చెల్లించాలని సంబంధిత మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామగుండంలో కూల్చివేతల పాలన ఆపాలన్నారు. అనంతరం బాధితులతో కలిసి రామగుం డం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల మూలంగా, కార్పొరేషన్ అధికారుల సమన్వయ లోపం కారణంగా నష్టపోయిన చిరు వ్యాపారులకు నష్ట పరిహారం ఇచ్చి, వారికి ప్రత్యామ్నాయంగా వ్యాపారాలు చేసుకోవడానికి స్థలం చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, మారుతి, జె.వి.రాజు, కృష్ణవేణి, శివ కుమార్, శ్రీనివాస్ అచ్చె వేణు, వేణు,సతీష్, వాసు, శ్రీనివాస్,వెంకన్న ,రామకృష్ణ, కుమార్ నాయక్, వెంకటేష్, కిరణ్ జీ, తిమోతి, శ్రీనివాస్, పాల్గొన్నారు.


# కండిషన్ లో ఉన్న అంబులెన్స్ ఏర్పాటు చేయాలి



**గోదావరిఖని,జూన్27,**

పనిచేసే అంబులెన్స్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర సిఐటియు అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ కోల్ ఇండియా జేబీసీసీఐ ఒప్పందం ప్రకారం ప్రతి మైన్ పై అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కొంతకాలంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు డిమాండ్ చేసిందని అన్నారు. రామగుండం 1 ఏరియాలోని జీడికే2 ఇంక్లైన్, జీడీకే 11 ఇంక్లైన్ లో అంబులెన్స్ ఏర్పాటు చేశారని, ఎమర్జెన్సీ టైంలో అంబులెన్స్ పనిచేయడం లేదని, ఈనెల 24న అండర్ గ్రౌండ్ ఎల్ హెచ్ డి సెక్షన్ లో గ్రూప్ ఇంజనీర్ రామ్ దాస్ అస్వస్థకు గురై ఎమర్జెన్సీ లో ఆసుపత్రికి తరలించాలంటే మైన్ పై ఉన్న అంబులెన్స్ మొరాయించడంతో బొలెరో తీసుకొచ్చిన పరిస్థితి నెలకొందన్నారు. ఈనెల 26న సీఎం టు సెక్షన్లో ఉదయం చెట్టులో పనిచేస్తున్న ఒక ఫిట్టర్ మహిళ ట్రైనీ ఉద్యోగస్తాలు చాతిలో నొప్పి వస్తుందని అధికారులకు తెలపగా హుటాహుటిన అండర్ గ్రౌండ్ నుండి పైకి తీసుకొచ్చి వెంటనే మైన్ పై ఏర్పాటు చేసిన అంబులెన్స్ పనిచేయకపోవడంతో ఎమర్జెన్సీ లో బొలెరోలో ఏరియా హాస్పిటల్కు తీసుకు వచ్చిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వీరిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ కొంతకాలంగా పరిస్థితుల దృష్ట్యా హార్ట్ ఎటాకులు ఎక్కువ అవుతున్నాయని మేనేజ్మెంట్లు డిమాండ్ చేయగా అంబులెన్స్ లో ఏర్పాటు చేసినప్పటికీ అవి పని చేసే పరిస్థితి లేదని, ఈ రెండు సంఘటనలు రుజువు చేశాయన్నారు. సింగరేణి యాజమాన్యం కండిషన్లో ఉన్న అంబులెన్సులు ఒక మెడికల్ అటెండెంట్ ను తక్షణమే ఏర్పాటు చేయాలని, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టాలి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి




**మల్కాజిగిరి, జూన్ 27:** అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ రవి కిరణ్కు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. స్మశాన వాటికల అభివృద్ధి, స్ట్రామ్ వాటర్ డ్రైన్, బాక్స్ డ్రైన్లు, రెండవ దశ సిఆర్ఎంపి రోడ్లు, సిసి రోడ్లు, పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశామన్నారు. మారుతి నగర్ నుండి ఏఎస్ రావు నగర్ వెళ్లే రోడ్డు బాక్స్ డ్రైన్ పనులు పూర్తి అయినా ఇంతవరకు రోడ్డు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు సీసీ రోడ్డు లేని షాదుల్లా నగర్, శాలిబస్తి, యాదవ డైరీ ఫార్మ్ రోడ్, షాదుల్లా నగర్ ఈద్గా, పలు అభివృద్ధి పనుల సాయినాథపురం, ఈశ్వర్ నగర్ బస్తీలలో అవసరమైన చోట్లలో సిసి రోడ్లు వేయాలని ఉన్నారు. హిందూ, ముస్లిం స్మశాన వాటికలను అభివృద్ధి పరచాలని, భరణి కాలనీలోని స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మించాలని, మహాలక్ష్మి పూరి కాలనీలో సిసి రోడ్లు వేయించాలని అన్నారు. యాప్రాల్ సాయి కృష్ణ నగర్ ఫేస్ టులో సిసి రోడ్డు, భూపేష్ నగర్ యాప్రాల్లో, మధుర నగరర్ లో ఉన్న కమ్యూనిటీ హాల్ స్థలం ఆక్రమణ కాకుండా కాపాడాలని అన్నారు. వినాయక్ నగర్ లో ముస్లిం స్మశాన వాటికను అభివృద్ధి పరచాలని, పైపులైను వేసి తొవ్వి వదిలేసిన చోట సీసీ రోడ్లు నిర్మించాలని, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్లో దొడ్ల బస్తీ , వసంతపురి కాలనీ, తిరుమల నగర్ కాలనీలలో కమ్యూనిటీ హాల్ అసంపూర్ణంగా ఉన్న హాల్ ను పూర్తి చేయాలని, గౌతమ్ నగర్ డివిజన్లోని మల్లికార్జున నగర్ లో సీసీ రోడ్లు, వీధి దీపాల నిర్వహణ చేయాలని, మల్లికార్జున్ నగర్ రోడ్ నెంబర్ 9 లో చెత్త వేసి డంపింగ్ యార్డ్ గా తయారు చేస్తున్నారు దాన్ని తొలగించాలని అన్నారు. మోడల్ గ్రీన్ యార్డ్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, ఇండోర్ స్టేడియాలను నిర్మించాలని అన్నారు. అధికారులు కనీస ప్రోటోకాల్ పాటించాలని ఉన్నారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత రాము యాదవ్, బిఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, రావుల అంజయ్య, జేఏసీ వెంకన్న, ఏకే మురుగేష్, జీకే హనుమంతురావు, అమీనుద్దీన్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా అడ్వకేట్ వెంకటేశ్



**శంషాబాద్ రూరల్, జూన్ 27 :**

రాజేంద్రనగర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపి)గా శంషాబాద్ మండల పరిధిలోని చిన్నగోల్కొండ గ్రామానికి చెందిన చెందిన అడ్వకేట్ రామగల్ల వెంకటేశ్ నియామకం అయ్యారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తిలో తన సేవలను గుర్తించి రాజేంద్రనగర్ కోర్టు ఏజీపీగా నియమించినందున ధ్యన్యవాదాలు తెలిపారు. తన వద్దకు వచ్చిన కేసులను వాదించి బాధితులకు న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు వివరించారు. అడ్వకేట్ రామగల్ల వెంకటేశ్ స్వగ్రామం శంషాబాద్‌లోని చిన్నగోల్కొండ. అడ్వకేట్‌గా గత 18 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నట్లు వివరించారు. తన సేవలను గుర్తించిన రాజేంద్రనగర్ కోర్టు అసిస్టెంట్ గవరన్మెంట్ ప్లీడర్‌గా నియమించినట్లు చెప్పారు. గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించడ ంతో స్నేహితులు,న్యాయవాదులుహర్షంవ్యక్తంచేశారు

# అడిషనల్ కమిషనర్ల కుదింపు పేరెంట్ డిపార్ట్‌మెంట్స్‌కు ఇద్దరు రిలీవ్



**హైదరాబాద్** జీహెచ్ఎంసీలో అడిషనల్ కమిషనర్ల విషయంలో భారీ ప్రక్షాళనకు కమిషనర్ ఆర్వీ కర్ణన్ శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఉన్న అడిష నల్ కమిషనర్, ఇతర అధికారుల శాఖల్లో భారీగా మార్పులు చేశారు. పది మంది ఉన్న అడిషనల్ కమిషనర్ల స్థానాన్ని గతంలో మాదిరిగానే ఆరు స్థానాలకు కుదించారు. ఇద్దరు అడిషనల్ కమిషనర్లకు డిమోషన్ ఇచ్చారు. అడిషనల్ కమిషనర్లుగా కొనసాగిన డాక్టర్ ఎన్ యాదగిరి రావు, జి. నళిని పద్మావతిలను పేరెంట్ రిలీవ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం అద్వ ర్టైజ్ మెంట్, ఎలక్ట్రికల్ విభాగాల అదనపు కమిషనర్‌గా వ్యవహరిస్తున్న వేణుగోపాల్ రెడ్డి నుంచి అడ్వర్ టైజ్ మెంట్‌ను తొలగిస్తూ ఆ విభాగం అదనపు కమిషనర్, ఐఏఎస్ ఆఫీసర్ అయిన అనురాగ్ దసమకూరాయి. వేణు గోపాల్ రెడ్డికి చార్మినార్, సికింద్రాబాద్, ఎల్బీ నగర్ జోన్‌ల శానిటేషన్ విభాగానికి జాయింట్ కమిషనర్‌గా నియమించారు. స్పోర్ట్స్ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న యాదగి రిరావును ఆ బాధ్యతల నుంచి తప్పించి, యూబీడీ అదనపు కమిషనర్ సుభద్రాదేవికి స్పోర్ట్స్ బాధ్యతలను అదనంగా అప్పగించారు.

## విష ప్రయోగం.. ఐదు పులులు మృతి



**కర్ణాటక** –కేరళ సరిహద్దుల్లో ఐదు పులులు మరణించాయి. మలై మహదేశ్వర వైల్డ్ లైఫ్ డివిజన్ లో తల్లి పులి, నాలుగు కూనలు మరణించాయి. వాటికి సమీపంలో ఓ ఆవు కళేబరాన్ని అధికారులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు విషం పెట్టడం వల్లే ఈ పులులు మృతి చెందినట్లు తెలుస్తోంది . టైగర్ రిజర్వ్ లోపల పశువులను మేపుతున్న స్థానిక ప్రజల పనే అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.చనిపోయిన పులి కొన్ని రోజుల క్రితం ఒక ఆవును చంపినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఆ పగతోనే సమీప గ్రామస్థులు ఆవు కళేబరంలో విషం కలిపి పులికి ఎర వేసి ఉంటారని భావిస్తున్నారు. ఆ కళేబరం తిన్న పులులు చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. శవపరీక్షలో కూడా విష ప్రయోగం వల్లే చనిపోయినట్లుగా తేలిందని చెప్పారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. మూడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.కాగా, ప్రస్తుతం కర్ణాటకలో 563 పులులు ఉన్నాయి. మధ్యప్రదేశ్ తర్వాత దేశంలో రెండో స్థానంలో పులుల సంఖ్య కర్ణాటకలోనే ఉంది. ప్రభుత్వ స్థాయిలో పులుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ పశుసంపదను కాపాడుకోవడానికి మృగాలపై విషప్రయోగానికి వెళ్తున్నట్లు అటవీ శాఖ గుర్తించింది.

## ఇద్దరు కుమార్తెలపై.. ఐదేళ్లుగా తండ్రి అత్యాచారం, అరెస్ట్




జైపూర్: ఇద్దరు కుమార్తెలపై ఐదేళ్లుగా తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. వారు అనారోగ్యం చెందడంతో తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా ఈ దారుణం గురించి బయట పడింది. దీంతో ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఈ సంఘటన జరిగింది. జూన్ 20న కడుపు నొప్పితో బాధపడుతున్న ఇద్దరు కుమార్తెలను వారి తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లింది. డాక్టర్ ఆరా తీయగా గత ఐదేళ్లుగా తండ్రి తమపై అత్యాచారానికి పాల్పడినట్లు మైనర్ బాలికలు తెలిపారు. కడుపులో నొప్పితోపాటు మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు వారు చెప్పారు. ఇది తెలుసుకుని డాక్టర్, బాలికల తల్లి షాక్ అయ్యారు.కాగా, బాల కార్మికులు, బాలల లైంగిక హింసకు వ్యతిరేకంగా పనిచేస్తున్న అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ అనే సంస్థకు ఆస్రా ఫౌండేషన్ నుంచి జూన్ 21న ఈ సమాచారం తెలిసింది. దీంతో బాధిత బాలికలు, ఆమె తల్లిని సురక్షిత ప్రాంతానికి రప్పించారు. జరిగిన దారుణం గురించి తెలుసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోవైపు ఇద్దరు కూతుళ్లపై ఐదేళ్లుగా తండ్రి అత్యాచారానికి పాల్పడం గురించి ఆ ఎన్జీవో సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆ బాలికలను మెడికల్ బోర్డు పరీక్షించింది. మెడికల్ రిపోర్ట్స్‌లో ఈ దారుణం నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో బాలికల తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం
## ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఉట్నూర్ :** ప్రజలందరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని జిల్లా ఇన్ ఛార్జీ జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలో జిల్లా ఆస్పత్రిలో 50 బెడ్స్ నుండి 100 బెడ్స్ గా రూ.13కోట్ల 75లక్షలతో అప్ గ్రేడేషన్ శుక్రవారం ప్రారంభించారు. కాగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ విఠల్ లతో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రజలు ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సంబంధిత శాఖ మంత్రితో చర్చించి కృషి చేస్తానని పేర్కొన్నారు. అందరూ ఆరోగ్యంపై దృష్టిలో పెట్టుకొని రోగాల బారిన పడకుండా మంచి నాన్యమైన ఆహారం తీసుకోవాలని, రోగాలతో హాస్పిటల్ కి రాలేని పరిస్థితులు రావాలన్నారు.పూర్తి ఉచితంగా విద్యను అందించేందుకు ప్రభుత్వం ఖానాపూర్ నియోజకవర్గానికి 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై డోర్ టూ డోర్ సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను ఆదేశించారు. ఆ సమయంలో బోయవాడకి చెందిన పరమేశ్వరి సర్ మా పిల్లలకు చదువులో, జాబ్స్ లలో అవకాశం కల్పించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి స్పందిస్తూ ఉద్యోగాల విషయంలో నైపుణ్యాలు ఉండాలని ప్రభుత్వ నోటిఫికేషన్ లకు పూర్తి స్థాయిలో చదువుకోవాలని సూచించారు.అంతకుముందు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఏజెన్సీకి తలమానికంగా ఉన్న ఉట్నూర్ ఆస్పత్రికి డాక్టర్లు, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇక్కడికి డాక్టర్లు రావడం లేదన్నారు. ఈ పోస్టులకు మంజూరు చేయడంతో పాటుగా భర్తీ చేసి ఇక్కడ జాబ్స్ చేసే విధంగా చూడాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఇటీవల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం అకాల మరణంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు ఆయన పరామర్శించారు. స్థానిక కేబీ కాంప్లెక్స్ పీఎమ్మార్సీ భవనంలో ఆదివాసి పెద్దలతో సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి ప్రోగ్రాం ఉదయం 10.45 జరగాల్సి ఉండగా కొన్ని కారణాలతో 2 గంటలకు ప్రోగ్రాం జరిగింది. మంత్రి ప్రోగ్రాం కోసం ఉదయం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆదివాసి నాయకులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్, అధికారులు పాల్గొన్నారు.

## హోమ్ కేర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**సంగారెడ్డి, జూన్ 27 :** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు హోమ్ కేర్‌లో నర్సింగ్ అసిస్టెంట్లుగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు మెడ్వాన్ డైరెక్టర్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మెడ్వాన్ కార్యాలయంలో నిరుద్యోగ యువకులతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి స్వంత కాళ్లపై నిలబడే విధంగా చేస్తున్న ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రతీ నెలా 30 మందికి శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. యువతను లైఫ్ సర్కిల్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధికి శిక్షణకు ఎంపిక చేశామన్నారు.అలాగే వృద్ధులకు ఆరోగ్య సంరక్షణ, సేవలు అందించడంలో యువతకు సాధారికత కల్పించడానికి ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమన్నారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందని, మొదటి నెల తరగతి గది శిక్షణ, ఆ తర్వాత రెండు నెలలు ఆన్ జాబ్ శిక్షణ (ఒజేటీ) ఉంటుందన్నారు.ఒజేటీ సమయంలో రెలకు రూ.10వేల స్టైఫండ్ ఇస్తారని, దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. శిక్షణ పూరె?న తర్వాత ప్రారంభవేతనం నెలకు రూ.17వేలు ఉంటుందని, ఉచిత హాస్టల్, భోజన సౌకర్యాలు ఉంటాయన్నారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని డైరెక్టర్ కోరారు. ఈ సమావేశంలో లైఫ్ సర్కిల్ ప్రతినిధి మధుకర్, మెడ్వాన్ కో–ఆర్డినేటర్లు సమీర్, స్వప్న, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో : కేసీఆర్ ప్రభుత్వంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని, తల తిక్క పనులతోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని, అందుకే కుప్పకూలిపోయిందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ%ß% ఫోన్ ట్యాపింగ్ లు చేయడం ఆదర్శ పాలన ఎట్లా అవుతుందనీ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు ఇతర అంశాల్లో కూడా కేసీఆర్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

## కోల్‌కతాలో మరో దారుణ ఘటన.. న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం





**పశ్చిమ బెంగాల్** రాష్ట్రం కోల్‌కతాలో మరో దారుణ ఘటన చోటు చేసుకుంది. కస్బా పరిసరాల్లో ఓ న్యాయ విద్యార్థిని పై సామూహిక అత్యాచారం జరిగింది. బుధవారం రాత్రి 7:30 నుంచి 8:50 గంటల మధ్య కాలేజ్ క్యాంపస్ లో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటి వరకూ ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిలో ఇద్దరు విద్యార్థులు కాగా, మరో వ్యక్తి కళాశాల సిబ్బందిగా పేర్కొన్నారు. ఈ ఘటనపై కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇది చాలా తీవ్రమైన సంఘటన అని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఇంకా పూర్తి సమాచారం తనకు అందలేదని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఈ ఘటనపై బీజేపీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఈ మేరకు రాష్ట్రంలోని మమతా బెనర్జీ నేతృతంలోని తృణమూల్ ప్రభుత్వంపై విమర్శలు చేసింది. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులకు భద్రత కరవైందని ధ్వజమెత్తింది. కాగా, 2024 ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రిలో సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కాగా ఆర్‌జీకార్ దవాఖాన డాక్టర్లు, వైద్య విద్యార్థులు సుదీర్ఘకాలం ఆందోళనలు నిర్వహించారు. ఘటన అనంతరం ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసును సీబీఐ విచారించింది. ప్రధాన నిందితుడిగా సంజయ్ రాయ్ పేరును ఛార్జ్‌షీట్‌లో చేర్చి కోర్టుకు సమర్పించింది. దీనిపై విచారణ జరిపిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారించింది. ఈ మేరకు దోషికి జీవితఖైదు విధించింది. ఈ ఘటన మరవకముందే ఇప్పుడు మరో విద్యార్థినిపై అత్యచారం ఘటన వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోంది.

## టాటా గ్రూప్ కీలక నిర్ణయం.. విమాన ప్రమాద
## బాధితుల కోసం రూ.500 కోట్లతో ట్రస్ట్



**అహ్మదాబాద్** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై టాటా గ్రూప్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రమాద బాధిత కుటుంబాలకఆర్థిక సాయం అందించేందుకు ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని టాటా సన్స్ నిర్ణయించింది. ఇందుకోసం బోర్డును అనుమతి కోరినట్లు తెలిసింది. ఈ ట్రస్ట్‌కు రూ.500 కోట్లు కేటాయించేలా అనుమతి కోరినట్లు సమాచారం. జూన్ 12న జరిగిన విషాదం తర్వాత గురువారం జరిగిన మొదటి బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనను తీసుకొచ్చారు అధికారుల సమాచారం ప్రకారం.. ఈ ట్రస్ట్‌కు కేటాయించే సొమ్ముతో ప్రమాదంలో మరణించిన 271 బాధిత కుటుంబాలకు పరిహారం అందించనున్నారు. అంతేకాదు, క్షతగాత్రుల వైద్య ఖర్చులు, ప్రమాదం జరిగిన సమీపంలో దెబ్బతిన్న మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, విమాన శకలాల కారణంగా దెబ్బతిన్న వాటిని పునరుద్ధరించడం వంటి పనులు ఈ ట్రస్ట్ ద్వారా చేపట్టనున్నారు. మిగిలిన మూల ధన సొమ్మును బాధిత కుటుంబాల దీర్ఘకాలిక అవసరాలు తీర్చేందుకు వినియోగించాలని సంస్థ భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ట్రస్ట్‌ను రిజిస్టర్ చేసి.. దేశ, విదేశాల్లోని బాధితుల కుటుంబాలకు నేరుగా సహాయం అందించే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి టాటా మోటార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) పీబీ బాలాజీ నేతృత్వం వహిస్తారు.జూన్ 12న ఎయిర్ ఇండియా డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన విమానం అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరింది. మధ్యాహ్నం 1:30 గంటలకు అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో టేకాఫ్ అయిన విమానం నిమిషాల్లోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలింది. విమానం కూలిన వెంటనే 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో విమానంలో ప్రయాణికులు, సిబ్బంది మొత్తం 242 మంది ఉన్నారు. అందులో 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు ఇక విమానం మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలడంతో అందులోని కొందరు మెడికోలు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో మొత్తం 270 మందికిపైగా మరణించారు. ఈ విమాన దుర్ఘటనను టాటా యాజమాన్యం చాలా సీరియస్‌గా తీసుకుందది. సంస్థకు ఈ ఘటన పెనుసవాలుగా మారడంతో ఛైర్మన్ చంద్రశేఖరన్ స్వయంగా రంగంలోకి దిగారు. ప్రభుత్వంతో సంబంధాలు, ప్రయాణికుల భద్రత, విమానాల నిర్వహణ, సిబ్బంది సంక్షేమం వంటి కీలక అంశాలను ఆయన నేరుగా పర్యవేక్షించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## భారత్‌లోనే బ్రిటన్ ఫైటర్ జెట్.. రిపేర్ల కోసం త్వరలో
## బ్రిటన్ నుంచి 40 మంది ఇంజినీర్ల బృందం రాక



**తిరువనంతపురం** ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల లో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్–35 బీ ఇంకా కేరళ తిరువనంతపురం ఎయిర్‌పోర్టు లోనే ఉంది. సాంకేతిక సమస్య కారణంగా ల్యాండ్ అయిన ఈ జెట్ 13 రోజులు గడుస్తున్నా ఇంకా గాల్లోకి ఎగరలేదు.జెట్‌లో తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి వరకూ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దీంతో చేసేదేమీ లేక ప్రత్యేక టెక్నీషియన్లు, ఇంజినీర్లతో కూడిన 40 మంది సభ్యుల బృందాన్ని యూకే నేవీ రంగంలోకి దింపుతోంది. ఈ బృందం త్వరలోనే కేరళకు రానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ ఆరుబయట ఉన్న ఈ యుద్ధ విమానాన్ని హ్యాంగర్‌కు తరలించేందుకు ప్రత్యేక ట్రాలీని కూడా యూకే నుంచి తెప్పించారు. ఈ జెట్‌ను రిపేర్ల కోసం ఉద్దేశించిన ప్రత్యేక ఎయిర్ ఇండియా హ్యాంగర్‌లోకి తరలించే అవకాశం ఉంది.బ్రిటన్ దేశానికి చెందిన హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ క్యారియర్ ఇటీవల ఇండో–పసిఫిక్ రీజియన్‌లో భారత నేవీతో కలిసి సంయుక్తంగా యుద్ధ విన్యాసాలు చేసింది. బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన ఆ నౌకలోని యుద్ధ విమానం ఎఫ్–35 ఇంధనం తగ్గడంతో జూన్ 14న తిరువనంతపురంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యిందని ముందుగా వార్తలు వినిపించాయి. అయితే, ఇన్ని రోజులు అది ఇక్కడే ఉండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు తెలిసింది.ఆ ఫైటర్ జెట్‌లో సమస్యను సరిచేసిన తర్వాత తిరిగి హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ పైకి చేర్చేందుకు ప్రయత్నాలు జరుగు తున్నాయి. ప్రస్తుతం ఈ ఫైటర్‌జెట్‌కు సీఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తున్నది. మన దేశంలో ఓ విదేశీ యుద్ధ విమానం ఐదు రోజులపాటు నిలిచిపోవడం, అందులోనూ ఎఫ్–35 లాంటి 5వ తరం స్టెల్త్‌జెట్ మోరాయించడం సాధారణ విషయం కాదు.ఈ విమానం షార్ట్ టేకాఫ్‌తోపాటు వర్టికల్ ల్యాండింగ్ అవుతుంది. అమెరికా సహా అతికొద్ది దేశాల ఎయిర్‌ఫోర్సుల వద్దే ఈ ఫైటర్ జెట్ ఉంది. అంతటి శక్తివంతమైన ఈ జెట్ ఇన్ని రోజుల పాటూ నెట్టింట మీమ్స్ పేలుతున్నాయి. ఈ యుద్ధ విమానంసేల్‌కు ఉంది అంటూ నెట్టింట పోస్టులు దర్శనమిస్తున్నాయి. ఈ ఫైటర్ జెట్ అమ్మకానికి వచ్చింది.. ఎవరైనా కొంటారా..? అంటూ నెటిజన్లు నెట్టింట తెగ పోస్టులు పెడుతున్నారు. 110 మిలియన్ డాలర్ల జెట్‌ను కేవలం 40 మిలియన్ డాలర్లకే పొందొచ్చంటూ జోకులు వేస్తున్నారు

## భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన పంజాబ్ పోలీసులు



చండీగఢ్: పాకిస్థాన్ ఐఎస్ఐ సహకారంతో భారీ ఉగ్రకుట్రను జరిగిన ప్లాన్‌ను పంజాబ్ పోలీసులు శుక్రవారంనాడు భగ్నం చేశారు. టెర్రర్ మాడ్యూల్ ఆటకట్టించారు. ఉగ్ర కుట్రకు పన్నాగం పన్నిన ఒక మైనర్‌తో సహా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (%దీఖ×%)కు చెందిన వారిగా గుర్తించారు. భారీ ఉగ్రకుట్రను భగ్నం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడగలిగామని డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. అమృత్‌సర్‌లో లక్షిత హత్యలు, పోలీసు స్టేషన్లపై దాడులకు ఈ టెర్రర్ మాడ్యూల్ ప్లాన్ చేసినట్టు చెప్పారు.'ఇంటెలిజెన్స్ సమాచారంతో రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్ సెల్ ఈ ఆపరేషన్ నిర్వహించింది. పాక్ ఐఎస్ఐ సహకారం కలిగిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ టెర్రర్ మాడ్యూల్‌ను విజయవంతంగా పట్టుకున్నాం. యూకేకు చెందిన నిషాన్ సింగ్, పాకిస్థాన్‌కు చెందిన టెర్రరిస్ట్ హర్వీందర్ రిండాలు దీనిని ఆపరేట్ చేస్తున్నారు. బీకేఐతో అసోసియేషన్ కలిగిన ఒక జువనైల్, మరో ఇద్దరిని అరెస్టు చేశాం' అని డీజీపీ తెలిపారు.ఈ ఆపరేషన్‌లో రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లు, ఒక పిస్తోలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని డీజీపీ చెప్పారు. పట్టుబడిన ఇద్దరిని అమృత్‌సర్ రూరల్‌కు చెందిన సెహజ్‌పాల్ సింగ్, విక్రమ్‌జిత్ సింగ్‌గా గుర్తించామని, మరో జువెనైల్ కూడా ఉన్నాడని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, పేలుడు పదార్థాల చట్టంలోని వివిధ సెక్షన్ల కింద మొహాలి పోలిస్ స్టేషన్‌ను ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. రాష్ట్రంలో టెర్రర్ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేసి, సంస్థాగత నేరాలను నిర్మూలించడం ద్వారా శాంతి, సామరస్య స్థాపనకు పంజాబ్ పోలీసులు కృతనిశ్చయంతో ఉన్నారని వివరించారు.దీనికి ముందు ఏప్రిల్‌లో పంజాబ్ పోలీసులు ఐఎస్ఐ సహకారం ఉన్న ఖలిస్థాన్ టెర్రర్ మాడ్యూల్‌కు చెందిన 13 మందిని అరెస్టు చేశారు. రెండు రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్‌లు, రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లు, ఐఈడీలు, ఆర్‌డీఎక్స్, ఇతర మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## స్కూటీని ఢీకొట్టిన టిప్పర్ లారీ.. తల్లి కండ్ల ముందే చిన్నారిపై నుంచి వెళ్లిన లారీ



**దుండిగల్, జూన్ 28:** రెప్పపాటు సమయంలో జరిగిన ప్రమాదంలో కన్నతల్లి కండ్ల ముందరే ఓ చిన్నారి దుర్మరణం చెందిన హృదయ విదారక సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన రాజు రెడ్డి, నిహారిక దంపతులకు కొడుకు అభిమన్యు రెడ్డి (6), కూతురు ఉన్నారు.రాజు కుటుంబం గత కొంత కాలం క్రితం ఉపాధి కోసం వలస వచ్చి నగర శివారు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధి, దుండిగల్ మున్సిపాలిటీలోని మల్లంపేట్ ఆకాష్ లేఔట్‌లో స్థిరపడింది. రాజు రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తుండగా, నిహారిక గృహిణి. అభిమన్యురెడ్డి బౌరం పేటలో గీతాంజలి స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే అభిమన్యురెడ్డిని ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో స్కూల్‌కు తీసుకువెళ్లేందుకు తన స్కూటీపై కొడుకును కూర్చోబెట్టుకున్న నిహారిక ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరింది.కొద్దిసేపటి అనంతరం స్కూటీ పల్లవి స్కూల్ వద్దకు రాగానే వెనుక నుంచి కంకర లోడుతో దూసుకు వచ్చిన టిప్పర్ లారీ (టీఎస్ 15 యుఎఫ్ 4599) స్కూటీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అభిమన్యు రెడ్డి రోడ్డుపై కుడివైపు పడిపోగా.. అతనిపై నుంచి టిప్పర్ లారీ టైర్లు దూసుకెళ్లాయి. దీంతో తల నుజ్జు నుజ్జై రెప్పపాటు సమయంలో అభిమన్యు రెడ్డి దుర్మరణం చెందాడు. కన్నుమూసి తెరిచేలోగా తన కొడుకు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లి రోదనలు మిన్నంటాయి. ఈ హృదయ విదారక దృశ్యం చూసే వాళ్లని సైతం కంటనీరు పెట్టించింది.సమాచారం అందుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, బాలుడు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో నిహారిక సైతం గాయాలు కావడంతో చికిత్స కోసం ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll, 9948265095-9494117870..Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, medaktoday89@gmail.com 9948265095..